# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలో పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవ హర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**2.** **ప్రయాణికుల సౌకర్యార్థం రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు.**

**3.** **రాష్ట్రంలో ఎక్కడా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోలేదని, యధాతథంగా కొనసాగుతున్నాయని ఆరోగ్యశ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ లక్ష్మీషా తెలిపారు.**

**4.** **తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించిన సేవా టిక్కెట్లను తిరుమల తిరుపతి దేవస్థానం - టీటీడీ ఈరోజు విడుదల చేసింది.**

**5.** **రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈ రోజు వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.**

==========================

రాష్ట్రంలో జూన్ 12న పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫాం, బ్యాగులు వంటివి విద్యార్థులకు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. 2024-25 విద్యా సంవత్సరం ఏర్పాట్లు, నాడు నేడు పనుల ప్రగతి, మధ్యాహ్నం భోజనం పథకం వంటి అంశాలపై రాష్ట్ర సచివాలయంలో నిన్న విద్యా శాఖ అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. పుస్తకాలు, యూనిఫామ్లు, బ్యాగులు తయారీపై ప్రతి రోజూ పర్యవేక్షించి, సకాలంలో విద్యార్థులకు అందేలా చూడాలని అధికారులను డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు.

--------------------------

ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేయనున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రేపటి నుంచి విశాఖ-చెన్నై సెంట్రల్, 25 నుంచి చెన్నై సెంట్రల్-విశాఖ, 26 నుంచి విశాఖ-పారాదీప్, 27 నుంచి పారాదీప్-విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు, 28 నుంచి విశాఖ-కర్నూల్ టౌన్, 29 నుంచి కర్నూల్ టౌన్-విశాఖ మధ్య నడిచే వేసవి ప్రత్యేక రైళ్లు ఎల్‌హెచ్‌బీ అదనపు బోగీలతో నడుస్తాయని తెలిపారు. రెండు సెకండ్ ఏసీ, మూడు థర్డ్ ఏసీ, 9 స్లీపర్, 4 జనరల్ సెకండ్ క్లాస్, ఒక సెకండ్ క్లాస్ సిటింగ్ కమ్ లగేజీ, దివ్యాంగజన్ కోచ్, ఒక జనరేటర్ మోటార్ కార్‌తో ఆయా రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

---------------------------

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేద, మధ్య తరగతి రోగులకు యథావిధిగా ఉచిత చికిత్సలు అందుతున్నాయని ఎక్కడా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోలేదని ఆరోగ్యశ్రీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ లక్ష్మీషా తెలిపారు. ఈ పథకం కింద 3 వేల 257 ప్రక్రియలలో నగదు రహిత చికిత్సను అందిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి అన్ని ఆస్పత్రులకు 203 కోట్ల రూపాయల విలువైన బిల్లులు చెల్లించామని మిగిలిన బకాయిలనూ త్వరలోనే విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ లక్ష్మీషా తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి సంబంధించిన సేవా టిక్కెట్లను ఆన్ లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం – టీటీడీ ఈరోజు విడుదల చేసింది. అంగప్రదక్షిణం టోకెన్లను ఉదయం ఆన్‌లైన్‌లో విడుదల చేయగా, ఈరోజు మధ్యాహ్నం 3గంటలకు వయోవృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేక టోకెన్లను విడుదల చేయనుంది. ఆగస్టు నెలకు సంబంధించి మూడు వందల రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే రేపు మధ్యాహ్నం ఆగస్టు నెలకు సంబంధించిన వసతి కోటాను కూడా టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి టోకెన్లను బుక్ చేసుకోవాలని టీటీడీ ప్రకటనలో కోరింది.

---------------------------

తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ –ఏపీనిట్‌లో 2024–25 జూన్‌కు సంబంధించిన పీహెచ్‌డి, ఇంటర్ డిస్సిప్లినరీ కోర్స్‌లకు అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అకడమిక్ డీన్ డాక్టర్ టి. కురుమయ్య తెలిపారు. పూర్తిస్థాయి కోర్సులకు మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ పరీక్షలో విధిగా అర్హత సాధించాలన్నారు. పార్ట్ టైమ్ అభ్యర్థులు మాస్టర్ డిగ్రీతోపాటు ఏదైనా అకడమిక్ ఇనిస్టిట్యూట్ లేదా పరిశ్రమలో రెండేళ్లు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. అభ్యర్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత పరీక్ష, ముఖాముఖి పరీక్షల ద్వారా అర్హులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు నిట్ వెబ్ సైట్ www.nitandhra.ac.inను సందర్శించాలని కోరారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జూన్ 4 వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిచికేత్ షల్‌కే తెలిపారు. నిన్న గుంటూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. హింసాత్మక ఘర్షణలు జరిగినపుడు ఎలా స్పందించాలనే అంశాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ, శాంతిభద్రతల రక్షణలో భాగంగా, ప్రజలలో భద్రతాభావం పెంచటానికి మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా ఏవైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన వంటి వ్యవసాయ, అనుబంధ రంగాల్లోని పథకాలన్నిటినీ ఒకే వ్యవస్థ కిందకు తెచ్చి అమలు చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కేఎస్

జవహర్ రెడ్డి ఏకీకృత వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2024-25 అమలుపై రాష్ట్ర స్థాయి సాంక్షనింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద చేపట్టే వివిధ పథకాలకు నిధుల మంజూరు తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. నిన్న బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రిటర్నింగ్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాలకు 12కౌంటింగ్ హాల్స్, పోస్టల్ బ్యాలెట్ కొరకు మరో రెండు కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుల్స్ ఏర్పాటు చేయాలని, ఈనెల 30వ తేదీన ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు.

---------------------------

కృష్ణాజిల్లాలో రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా ప్రమాదాలు తగ్గించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రత, రవాణా శాఖద్వారా వాహనాలకు పర్మిట్ జారీ, రెవెన్యూ వసూళ్లు, వాహనాల లైఫ్ ట్యాక్స్ వసూళ్లు తదితర అంశాలపై నిన్న మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగహనా కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని వైయస్సార్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి. విజయ్ రామరాజు పేర్కొన్నారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును జూన్ 4వ తేదీన నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు అక్కడక్కడ వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈరోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 26 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరాలకు ఆనుకుని ఉంది. ఈ అల్పపీడనం ఈశాన్య దిశగా కదులుతూ రేపు ఉదయానికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. మధ్య బంగాళాఖాతం నుంచి బంగ్లాదేశ్ వైపు కదిలే అవకాశం ఉన్నందున రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

=====================